క్లుప్తంగా

కల్చరల్ పోటీల్లో యర్రగుంట్ల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

శిరివెళ్ల: నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన కల్చరల్ పోటీల్లో యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వ్యాసరచన, పద్య తోరణం, గ్రూప్ డిస్కర్షన్ పోటీలలో బీఏ విద్యార్థిని సౌమ్య ద్వితీయ స్థానం సాధించింది. రంగోళి పోటీలలో బీఎస్సీ విద్యార్థులు గురు అంజలి, రింషా, స్టాండ్‌బై కామెడీలో బీకాం విద్యార్థిని ఆసియా, బీఏ విద్యార్థిని సౌమ్య, పోస్టర్ రెప్రజెంటేషన్‌లో బీఎస్సీ విద్యార్థులు రాహుల్, కార్తీక్‌లు సత్తాచాటారు. ఈ నేపథ్యంలో వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాహుః కాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

పశు గ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు తిప్పమీద శుక్రవారం తెల్లవారు జామున సంభవించిన అగ్ని ప్రమాదంలో మునెయ్య అనే రైతుకు చెందిన పశు గ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బాధిత రైతు పాడి పశువులతో జీవనం సాగించే వాడు. ఏడాది పాటు వాటికి గ్రాసం కొరత లేకుండా 600 వరి గడ్డి కట్టలు, ఒక ట్రాక్టర్ జొన్న సొప్ప కొనుగోలు చేసి ఇంటి వద్ద వామిగా వేసుకున్నాడు. అయితే, గుర్తు తెలియని కొందరు వామికి నిప్పు పెట్టారు. ఆలస్యంగా గుర్తించిన బాధిత రైతు గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి పరుగులు తీసి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలి బూడిదైందని రైతు మునెయ్యకు దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

బండిఆత్మకూరు: మండలం పరిధిలోని కడమల కాలువ గ్రామంలో శివనందీశ్వరస్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. రూ.48,636 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పి.హరిశ్చంద్రారెడ్డి, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

30న తూడిచెర్లలో కబడ్డీ పోటీలు

జూపాడబంగ్లా: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న తూడిచెర్ల గ్రామంలో పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్లుయాదవ్, సురేష్‌యాదవ్, వేణుగోపాల్‌యాదవ్, శంకర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన 8790023280, 9908747631 ఫోన్ చేసి, రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: మాజీ సైనిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు జిల్లా సైనిక బోర్డు వెల్ఫేర్ అధికారి రత్న రూతమ్మ, అసిస్టెంట్ అధికారి పుష్పలత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, హెన్రీబాబు, ట్రెజరర్ మాబాష ఆధ్వర్యంలో మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు.



జామియా మసీదులో రంజాన్ మాసం చివరి జుమ్మా నమాజ్‌కు పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలు

యా అల్లా.. సబ్‌కో ఖుష్ రకో

రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్ర మాసం. నెలరోజుల పాటు కఠోర ఉపవాసాలు ఉంటారు. ఐదుపూటలా నమాజ్, ఖురాన్ పఠనం చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. ఈనెల 2వ తేది రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో చివరి జుమ్మా కావడంతో శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మతపెద్దలు, ఇమామ్‌లు రంజాన్ మాస గొప్పతనాన్ని, చివరి శుక్రవారం ప్రాశస్త్యాన్ని వివరించారు. ఎంతో పవిత్రంగా భావించే ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని, ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలని, పేదలకు చేతనైన సాయం చేయాలని చాగలమర్రి జామియా మసీదు హాఫీజ్ సులేమాన్ చెప్పారు. చివరలో సబ్‌కో ఖుష్ రకో (అందరినీ సంతోషంగా ఉంచు) అంటూ అల్లాను ప్రార్థించారు.

చాగలమర్రి



శ్రీలక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయం,



ప్రత్యేక అలంకరణలో కంబగిరిస్వామి

కంబగిరయ్య ఉత్సవాలకు రారండోయ్

మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఏటా ఉగాది పండుగకు ఈ స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ నెల 30న ఉగాది పండుగ సందర్భంగా వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి చంద్రుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం స్వామి కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ వేడుకను తిలకించేందుకు ఉయ్యాలవాడ మండలంతో పాటు వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

ఉయ్యాలవాడ

బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

నంద్యాల: బీడు భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో నాణ్యమైన ఉల్లి, మిర్చి, పసుపు పెంపకం కోసం హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వర్క్ షాప్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఖరీఫ్ చివరిలో మూడు నెలలు మాత్రమే 2 లక్షల ఎకరాల్లో శనగ పంట వేసి తర్వాత 9 నెలల సమయమంతా బీడు భూములుగా వదిలేస్తున్నారన్నారు. ఇలా వదిలేయకుండా ఆ భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో హార్టికల్చర్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, మార్క్‌ఫెడ్ డీడీ హరినాథ్ రెడ్డి, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దొర్నిపాడు: రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టి కాలుష్య రహిత పంటలను పండించాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగ ఎస్ఎఫ్ఏబీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఖరీఫ్- 2025 ప్రణాళికపై డీఆర్‌డీఏ శాఖ అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వ్యవసాయంలో రైతులు అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం ద్వారా ఆహారధాన్యాలు, కూరగాయలు కలుషితం కావడంతో మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఈ ఖరీఫ్ నుంచి రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుచేసేలా అడుగులు వేయాలన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా రసాయన రహిత దిగుబడులు సాధించ వచ్చన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బాబు మాట్లాడుతూ పెరటి తోటల ద్వారా ఏడాది పొడవునా ఉపాధి దొరుకుతుందన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అతిథులు, ఈఎస్సీ పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి బాలరాజు, హెచ్ఆర్ వీల్స్ ఇండియా లిమిటెడ్ మేనేజర్ దివాకర్, టీజీ జెన్‌కో డివిజనల్ ఇంజినీర్ రూపేష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఈఎస్సీ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 20 పరిశ్రమలు నిర్వహించిన జాబ్ మేళాలో డీఈసీ విభాగం నుంచి 66మంది, డీఈసీఈ విభాగం నుంచి 155 మంది, డీఈఈఈ విభాగం నుంచి 162 మంది, డీఎంఈ విభాగం నుంచి 133మంది మొత్తం 516 మంది ఎంపికయ్యారు. కాలేజీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారికి ఆర్డర్ కాపీలు అందజేశారు. ఈఎస్సీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ చిన్న వయస్సులో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ గల జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. పాలిసెట్-2025 ఏడాదికి హాజరవుతున్న అభ్యర్థులకు కాలేజీలో ఉచిత శిక్షణ, ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తున్నారని, ఆసక్తి గల వారు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. అంతకు ముందు విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు రాజేష్, డాక్టర్ సురేష్‌బాబు, రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి అదనపు సాయం



చాగలమర్రి జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ హరగోపాల్

చాగలమర్రి: జిల్లాలో గృహ నిర్మాణాల వేగవంతానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, చెంచు వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అదనపు సాయం అందజేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీహరగోపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చాగలమర్రి కస్తూరిబాగాంధీ విద్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో చేపట్టిన గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోలేని ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 3,996 మందికి రూ.5.96 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 9,432 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మే నెల చివరిలోపు వాటిని పూర్తి చేయాలని, ఆ దిశగా లబ్ధిదారులను సంసిద్ధం చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు మంజూరై వారి బ్యాంకు ఖాతాలో ఒక్క రూపాయి జమ అయిన లబ్ధిదారులు కూడా సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో లబ్ధి పొందక పోయినా పొందినట్లు చూపిస్తే రేషన్, అధార్ కార్డును సచివాలయంలో అందజేయాలన్నారు. పరిశీలించి విజయవాడ హౌసింగ్ కార్యాలయంలో ఎడిట్ ఆప్షన్ ద్వారా తొలగించి కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తారని పీడీ తెలిపారు. ఆయన వెంట డీఈ పి.విజయబాబు, ఇన్‌చార్జ్ ఏఈ నరసింహ తదితరులున్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం జరుపుతున్న భక్తులు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేరస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బాచిరెడ్డి సోదరులు నూతన శివపార్వతుల విగ్రహాలను ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా పురోహితుడు దోర్నాల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఏకాదశి రుద్రాభిషేకం, కల్యాణం జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించగా భక్తులంతా శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

నంద్యాల: తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది ఉత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ రోజు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఈకేవైసీ పూర్తిచేయాలి

గోస్పాడు: రేషన్ కార్డులలోని ప్రతి సభ్యుడు ఈ-కేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో 12,388 రేషన్ కార్డులుండగా వాటిలో 34,256 సభ్యులు ఉన్నారన్నారు. వీరిలో 31, 291 మంది సభ్యులకు సంబంధించిన ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా జాబితాను సంబంధిత రేషన్ దుకాణాల డీలర్లకు అందజేసినట్లు చెప్పారు. సమావేశంలో సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోటాపోటీగా కానాల దిన మార్కెట్ వేలాలు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల మేజర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన దిన మార్కెట్ వేలాలు పోటాపోటీగా జరిగాయి. సర్పంచ్ బావమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నలుగురు పాట దారులు పాల్గొనగా మహబూబ్‌బాషా రూ. 2.11 లక్షలతో పాటను దక్కించుకున్నారు. దినమార్కెట్ వేలాలకు రూ.1.60 లక్షలు మాత్రమే పాట సాగడంతో ఈఓఆర్‌డీ జ్యోతి వేలం పాటను వాయిదా వేశారు. వేలం పాటలో డీఎల్‌పీఓ రవీంద్రబాబు, పీఎస్ సరళలు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ విద్యార్థికి ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి రుషికేష్‌కు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న ఈ విద్యార్థి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకొని విద్యార్థి కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో రూ.25 వేలు జమ చేసినట్లు దాత వెల్లడించారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

ఆత్మకూరు: దోపిడీ కేసులోని నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్థానిక మార్కెట్‌యార్డు వద్ద ఈనెల 25న రాత్రి బీరువాల షాపు బయట నిద్రిస్తున్న గయూబ్ వద్దకు మూర్తుజావలి, రమణ వచ్చారు. అతడిని నిద్రలేపి డబ్బు ఇవ్వాలని బెదిరించారు. మూర్తుజావలి తన చేతికున్న కడియంతో గయూబ్‌ని కొట్టి గాయపరిచి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.50 నగదు లాక్కుని బైక్‌పై పారిపోయారు. గయూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉదయం 9 గంటల సమయంలో ఉర్దూ పాఠశాల వద్ద ఉన్న నిందితులిద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైకు, కడియం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ దేవిక ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, శాంతారాంభట్, హనుమంతశర్మ, అర్చకుడు సునీల్ ముందుగా అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతుల అనంతరం మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం కనుల పండువగా సాగింది.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

● మాజీ ఎమ్మెల్యే గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రారెడ్డి



ఉపవాసదీక్షపరులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



ఇఫ్తార్‌లో ఫలహారం స్వీకరిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

చాగలమర్రి: ఇఫ్తార్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చక్రం బీడి ఫ్యాక్టరీ యజమాని, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా షబ్బీర్ అహమ్మద్ శుక్రవారం బసవన్న కట్ట వీధిలో ఉపవాసదీక్షపరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. తర్వాత దీక్షపరులకు ఆహార పదార్థాలు వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని చెప్పారు. దీక్షపరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్య కార్యమన్నారు. కార్యక్రమంలో మౌల్వీ అబ్దుల్ మజీద్ ఆరీఫ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షబ్బీర్, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఎంపీటీసీ పత్తి నారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, కార్యదర్శి శేషు రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సర్పంచ్ గోవిందయ్య, ఉప సర్పంచ్ షేక్ సోహెల్, వ్యాపార వేత్త నాయబ్ రసూల్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, యువజన విభాగం అధ్యక్షుడు వి.షరీఫ్, పార్టీ నాయకులు ఆర్.శ్రీనివాసులు, గేట్ల మాబు, బబ్లూ, పెయింటర్ రఫీ, ముల్లా షఫీ, రాచమడుగు రమణ, ముల్లా ఇబ్రహీం, వలి సాగారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివరామిరెడ్డి



సంబరాలు జరుపుకుంటున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్‌కు జరిగిన పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ ఎన్నికల అధికారి నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభం కాగా సాయంత్రానికి పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం చేపట్టిన ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారులు ఫలితాలను ప్రకటించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సమీప ప్రత్యర్థి సుబ్బరామిరెడ్డిపై 91 ఓట్లు ఆధిక్యంతో విజయం సాధించారు. ఉపాధ్యక్షునిగా నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీగా అంబటి గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా మురళీమోహన్, షాహినాబేగం, కోశాధికారిగా వినోద్‌కుమార్, లైబ్రరీ ఇంచార్జిగా దాదాపీర్‌లు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

మాన్యం భూమిలో అక్రమ మైనింగ్



మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిలో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. వివరాలు.. పలుకూరులో కిరణ్ అనే వ్యక్తి దేవదాయశాఖకు చెందిన సర్వే నంబర్ 308లో అక్రమ మైనింగ్ చేస్తుండడంతో ఆలయ అర్చకుడు భాస్కరయ్య, ఈఓ బ్రహ్మానందరెడ్డి వెళ్లి ప్రశ్నించారు. కిరణ్ వారితో వాగ్వాదానికి దిగడంతో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు సమాచారం ఇచ్చారు. ఆధారాలతో స్టేషన్ వద్దకు రావాలని కిరణ్‌కు ఫోన్ చేశారు. ఎంతకి రాకపోవడంతో సీఐ, ఎస్ఐ, ఈఓ మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అక్రమ మైనింగ్‌దారుడు అక్కడి నుంచి పారిపోయాడు. అనుమతి లేకుండానే మైనింగ్ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. శివాలయానికి చెందిన సుమారు రూ.4 కోట్ల విలువైన మాన్యం భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సబ్ జైలు తనిఖీ

డోన్ టౌన్: స్థానిక సబ్ జైలును శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశమై వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో భోజన వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. స్వతహాగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని పేద రిమాండ్ ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ తరుపున ఉచిత న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది మాధవ స్వామి ఉన్నారు.